సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 5 । నవంబర్ । 2024



సంఘాల సొమ్ము స్వాహా!

బ్యాంకులు మంజూరు చేసిన రుణం డబ్బును వీబీకే స్వాహా చేశాడు. రూ.16.8 లక్షలు సొంతానికి వాడుకున్నాడు. - 8లో



గుప్తనిధుల కోసం తవ్వకాలు

శాలిగౌరారం మండలం ఆకారంలోని సూర్య దేవాలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. - 8లో



యాదాద్రిలో దీపోత్సవం

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని యాదాద్రిలో సామూహిక దీపోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. - 9లో

న్యూస్‌రీల్

యాదాద్రి శివాలయంలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు చేపట్టారు. సోమవారం స్వామివారికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున స్వయంభూలను సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకులు... ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళ అర్చన చేశారు. ఇక ఆలయ ముఖమండపం, ప్రాకార మండపంలో శ్రీసుదర్శన హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం తదితర పూజలు నిర్వహించారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు



టెంపుల్‌సిటీపై హెలిపాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఈఓ

యాదగిరిగుట్ట : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 8న జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లు చేస్తోంది. యాదాద్రి కొండ దిగువన యాగస్థలం, టెంపుల్ సిటీపై ఉన్న హెలిపాడ్‌లతో పాటు సీఎం వెళ్లే మార్గాలను పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆలయ ఈఓ భాస్కర్‌రావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఎన్యూమరేటర్లకు సహకరించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరిటౌన్ : సమగ్ర కుటుంబ సర్వే చేయడానికి ఇళ్లకు వచ్చిన ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలని అదపపు కలెక్టర్ గంగాధర్ కోరారు. సోమవారం భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో ఎన్యూమరేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరించిన నిర్దేశిత ఫార్మాట్ ప్రకారం వివరాలు సేకరించాలని సూచించారు. పొరపాట్లకు తావు లేకుండా సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి, ఎంఈఓ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బాలకార్మిక చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి మాధవిలత

భువనగిరి క్రైం : బాల కార్మిక చట్టాలు, శిక్షలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవిలత, సీడబ్ల్యూసీ అధ్యక్షురాలు బి.జయశ్రీ పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా బాలకార్మిక నిర్మూలన, రక్షణ, పునరావాసం అనే అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. బడిఈడీ పిల్లలను తప్పనిసరిగా బడికి వెళ్లాలన్నారు. కొందరు తల్లిదండ్రులు వివిధ కారణాలతో పిల్లలకు చిన్నతనంలోనే వివాహాలు చేయడం అనాగరికన్నారు. బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి.హరినాథ్, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు హమీద్, న్యాయ వాదులు ఎస్.జైపాల్, జి.శంకర్, పీఎల్‌ఓలు రాంబాబు, శ్రీశైలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం.. పొంచి ఉన్న ప్రమాదం



భువనగిరి పట్టణ శివారులో పాత కలెక్టరేట్ వద్ద నడి రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం



గూడూరు సర్వీస్ రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యాన్ని దగ్గరకు చేర్చుతున్న రైతు, అటు పక్కనే వడ్ల రాశులు

రోడ్లపై ఆరబోసిన ధాన్యం ప్రయాణికుల ప్రాణాలమీదకు తెస్తోంది. గత వానాకాలం, యాసంగి సీజన్లలో పలువురు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఏటికేడు దిగుబడి పెరుగుతుండడం, ధాన్యాన్ని ఆరబెట్టడానికి సరైన స్థలం లేక రైతులు తారు, సీసీ రోడ్లను ఎంచుకుంటున్నారు. పగలు రోడ్డు సగభాగం వరకు ధాన్యాన్ని ఆరబెట్టడం, సాయంత్రం దగ్గరకు చేర్చి నల్లటి టార్పాలిన్లు కప్పుతుండడంతో రాత్రి సమయంలో కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జిల్లాలోని గ్రామీణ రహదారులపై ఎక్కడ చూసినా ధాన్యం కుప్పలే దర్శనమిస్తున్నాయి.

– భువనగిరి టౌన్

లెక్క తేలుస్తారు..

రేపటి నుంచి కులగణన.. యంత్రాంగం సిద్ధం

- ఇంటింటికి వెళ్లి సర్వే చేయనున్న ఎన్యూమరేటర్లు
- 15 రోజుల్లో పూర్తయ్యేలా కార్యాచరణ
- జిల్లాలో 2,47,354 నివాస గృహాలు

సాక్షి, యాదాద్రి : సమగ్ర కుటుంబ సర్వేకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఈనెల 6నుంచి ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించనున్నారు. ఇప్పటికే నివాస కుటుంబాల వివరాలను పూర్తిస్థాయిలో సేకరించారు. జిల్లాలో 2,47,354 ఇళ్లు ఉన్నట్లు లెక్క తేల్చారు. ప్రతి ఇంటికి యజమాని పేరు, వార్డు వివరాలతో కూడిన స్టిక్కర్ వేశారు. వాటి పరిధిలో సర్వే చేసేందుకు సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు బాధ్యతలు అప్పగించారు. వీరిలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, సీఆర్పీలు, వీఏఏలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. మున్సిపాలిటీ, మండల స్థాయిలో నోడల్ అధికారులను నియమించారు. సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

పదేళ్ల తరువాత మళ్లీ ఇంటింటి సర్వే

చివరిసారిగా 2011లో జనగణన జరిగింది. ఆ తరువాత 2014లో అప్పటి టీఆర్‌ఎస్ ప్రభుత్వం సకల జనుల సర్వే పేరుతో కుటుంబ సర్వే చేపట్టింది. మళ్లీ పది సంవత్సరాల తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేకు శ్రీకారం చుట్టబోతోంది. ఇందులో భాగంగా ఎన్యూమరేటర్లు ఈనెల 6వ తేదీ నుంచి క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేయనున్నారు. 150 ఇళ్లను ఒక ఎన్యూమరేషన్‌బ్లాక్(ఈబీ)గా విభజించారు. ఒక్కొక్కరు రోజుకు పది ఇళ్ల చొప్పున 15 రోజుల్లో 150 ఇళ్ల సర్వే పూర్తి చేయాల్సి ఉంటుంది. 2011 జనగణన ప్రకారం జిల్లాలో 1,746 ఎన్యూమరేషన్ బ్లాక్‌లు ఉన్నాయి. ప్రస్తుత జనాభా ప్రకారం 1,800 బ్లాక్‌లను అధికారులు గుర్తించారు.అయితే జనాభా పెరిగినందున ఎన్యూమరేషన్ బ్లాక్‌లో 250 ఇళ్లు ఉంటే మొదటి 150 ఇళ్లకు ఒకరు, మిగతా 100 ఇళ్లకు ఇంకో ఎన్యూమరేటర్‌ను నియమించి 100/ఏ, 100/బీగా గుర్తిస్తారు.



ఎన్యూమరేటర్లకు అవగాహన కల్పిస్తున్న చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి

సర్వేలో పాల్గొనేది వీరే..

సర్వేలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల 1,249 మంది పాల్గొంటారు. ఒక పూట పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజనం అనంతరం సర్వేలో పాల్గొనాలి. వీరితో పాటు ఎన్యూమరేటర్లు 50 శాతం ఉంటారు. ఎన్యూమరేటర్లలో అంగన్‌వాడీటీచర్లు, సీఆర్పీలు, వీఏఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల సిబ్బంది ఉంటారు. అంతా రెగ్యులర్ ఉద్యోగులనే తీసుకున్నారు.

పది మందికి ఒక సూపర్‌వైజర్

ప్రతి 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ చొప్పున 194 మందిని కేటాయించారు. అదే విధంగా జిల్లాలోని 17 మండలాలకు ప్రతి మండలానికి ఎంపీడీఓను నోడల్ అధికారిగా, ఒక ప్రత్యేక అధికారిని నియమించారు. ఆరు మున్సిపాలిటీలకు మున్సిపల్ కమిషనర్లను నోడల్ అధికారులుగా నియమించారు.

ఒక్కో కుటుంబానికి అరగంటకు పైనే సమయం

జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన బీబీనగర్, యాదగిరిగుట్ట, భువనగిరి మున్సిపాలిటీల్లో ఇటీవల సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. ప్రశ్నావళిలో 75 ప్రశ్నలు ఉండడంతో ఒక్కో ఇంట్లో వివరాలు సేకరించడానికి అరగంటకు పైనే సమయం పట్టింది. ఈ లెక్క ప్రకారంగానే రోజుకు 10 ఇళ్ల చొప్పున 15 రోజుల్లో 150 ఇళ్లను ఎన్యూమరేటర్ సర్వే పూర్తిచేయాలి. సర్వే చేసిన ప్రతి ఇంటికీ మరోమారు స్టిక్కర్ వేస్తారు.

సర్వే కీలకంగా మారనుంది

సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం. జిల్లాలో 2,47,354 ఇళ్లు ఉన్నట్లు ఎన్యూమరేటర్ల ద్వారా గుర్తించాం. సర్వే చేయడానికి వివిధ శాఖల సిబ్బందిని 1,938 మందిని నియమించాం. ప్రధాన, ఉప ప్రశ్నలతో కలిపి మొత్తం 75 అంశాలపై వివరాలు సేకరిస్తారు. ఏ రోజుకారోజు మండల స్థాయిలో వివరాలను ఆన్‌లైన్ చేస్తాం. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారు, పథకాలు అందని అర్హుల వివరాల లెక్క తేలుతుంది. ప్రభుత్వ పరంగా చేపట్టే కార్యక్రమాలకు ఈ సర్వే కీలకంగా మారనుంది.

–హనుమంతరావు, కలెక్టర్

ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో నమోదు

సర్వేలో సేకరించిన కుటుంబ వివరాలను ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. మండలాల వారీగా ప్రణాళిక అధికారుల పర్యవేక్షణలో పది మంది ఆపరేటర్లతో ఆన్‌లైన్ చేయిస్తారు. 20 రోజుల్లో డేటా ఎంట్రీ పూర్తవుతుంది. ఆ తర్వాత సమగ్ర వివరాలను ప్రభుత్వానికి పంపిస్తారు.

ఈ లెక్కలే ప్రామాణికం

సమగ్ర కుటుంబ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతుంది. చాలామందికి సరైన ఆధారాలు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారు. సమగ్ర కుటుంబ సర్వేతో సులభం కానుంది. సర్వే చేసే ప్రాంతాల్లో ఒక రోజు ముందుగానే ప్రజలకు సమాచారం ఇచ్చి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకునేలా అవగాహన కల్పిస్తారు. తద్వారా నిర్దేశిత సమయంలో సర్వే పూర్తి చేస్తారు. ప్రస్తుతం చేస్తున్న సర్వే కేవలం జనాభా లెక్కల కోసమే కాకుండా సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలియజేస్తుంది. తద్వారా ఆయా వర్గాలపై ప్రభుత్వానికి స్పష్టత వస్తుంది. దీంతో అభివృద్ధి పనులు, పథకాలు సులభంగా అమలు చేయడానికి సాధ్యపడుతుంది.

అగ్రరాజ్యంలో ఎన్నికలపై మనోళ్ల ఉత్కంఠ

- నేడు అమెరికాలో అధ్యక్ష ఎన్నికల పోలింగ్
- రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్‌ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ మధ్య హోరాహోరీ
- విజయం ఎవరిని వరిస్తుందోనని జోరుగా చర్చ

అక్కడ ఓటుహక్కు కలిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లావాసుల మనోగతం

- వివరాలు 8లో



ప్రజావాణికి అధికారులు డుమ్మా

- 15 శాఖల నుంచి గైర్హాజరు
- కలెక్టర్ సీరియస్
- షోకాజ్ నోటీసులు జారీ

సాక్షి, యాదాద్రి : ప్రజావాణికి హాజరుకాని అధికారులపై కలెక్టర్ హనుమంతరావు సీరియస్ అయ్యారు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి దాదాపు 48 శాఖలకు చెందిన జిల్లా అధికారులు హాజరుకావాల్సి ఉంది. కానీ, అందులో 15 శాఖల అధికారులు హాజరుకాలేదు. వారి బదులు కిందిస్థాయి ఉద్యోగులను పంపడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ప్రజావాణికి డుమ్మాకొట్టిన అధికారుల వివరాలు తెలుసుకున్నారు. కొందరు అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా హాజరుకాకపోవడాన్ని తీవ్రంగా పరిగణించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కాగా కలెక్టర్ తమ పేర్లను పిలిచి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విషయం తెలుసుకున్న కొందరు అధికారులు.. హుటాహుటిన ప్రజావాణికి వచ్చి కలెక్టర్‌కు సంజాయిషీ ఇచ్చారు.

అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపండి

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, బాధితులను తిప్పుకోవద్దని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. అదనపు కలెక్టర్లు, వీరారెడ్డి, గంగాధర్, జెడ్పీ సీఈఓ శోభారాణి, ఇతర జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణిలో బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 48 వినతులు వచ్చినట్లు తెలిపారు. అందులో రెవెన్యూ సమస్యలకు సంబంధించి 24 వినతులు ఉన్నట్లు తెలిపారు. అర్జీల పరిష్కారానికి చేపడుతున్న చర్యలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.



సమస్యలు వింటున్న కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్

వినతులు ఇలా..

- గీత కార్మిక సంఘాన్ని సొసైటీగా మార్చాలని కోరుతూ రాజాపేట మండలం కుర్రారం గీత కార్మిక సంఘం నాయకులు పాండవులు, భానుప్రకాష్‌గౌడ్ కలెక్టర్‌కు విన్నవించారు.
- మాసాపేట శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 104లో కొంత భూమిని కొందరు ఆక్రమించారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాహుపేట గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.
- కులగణన సర్వేలో ఎన్యూమరేటర్లు నింపే ఫార్మట్‌ను చూసుకునే అవకాశం కల్పించాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో విన్నవించారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



సైన్స్ ఎగ్జిబిషన్ మేళాలో పరికరాలను పరిశీలిస్తున్న ఐఐసీటీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వత్సలరాణి

- ఐఐసీటీ సైంటిస్ట్ డాక్టర్ వత్సలరాణి

చౌటుప్పల్ : విద్యార్థులు సాంకేతికత పట్ల ఆసక్తిని పెంచుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని హైదరాబాద్‌లోని ఐఐసీటీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వత్సలరాణి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారంతో సైన్స్ అండ్ టెక్ సిరి వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం చౌటుప్పల్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సైన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా సైన్స్ మేళా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. 100 రకాల ప్రయోగాలను చేసి చూపించారు. విద్యార్థులు ఎంతగానో ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తరగతి గదిలోనే ప్రయోగాల వైపునకు దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు తమ ఆలోచన విధానాలను శాస్త్రీయ కోణంలో తీసుకెళ్లాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సైతం విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐసీటీ సైంటిస్ట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా సైన్స్ ఆఫీసర్ నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు కర్నె శివకుమార్, సిరి వాలంటరీలు ఎల్లేష్, అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోనే సరి.. ఆటలేవీ!

- ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్యకు దక్కని ప్రాధాన్యం
- మెజార్టీ స్కూళ్లలో ఆడుకునేందుకు జాగ కరువు
- పీఈటీలు, పీఈడీలూ లేరు
- నిధులు కేటాయించని ప్రభుత్వం
- ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు

చౌటుప్పల్ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఆటలకు ఆదరణ కరువైంది. చదువుతో పాటు క్రీడలు ఉన్నప్పుడే విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంతో ఉంటారు. కానీ, మెజార్టీ స్కూళ్లలో విద్యార్థులు ఆడుకునేందుకు మైదానాలు లేవు. కనీసం క్రీడా పరికరాలు కూడా సమకూర్చడం లేదు. వీటితో పాటు వ్యాయామ ఉపాధ్యాయుల కొరత ఉంది. అందుబాటులో ఉన్న పీఈటీ, పీఈడీలు బోధన, కార్యాలయాల పనుల్లో మునిగిపోతున్నారు. మరోవైపు క్రీడలకు ప్రభుత్వం నిధులు కూడా కేటాయించకపోవడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు.

అమలు కాని మాక్ డ్రిల్

జిల్లాలో 732 ప్రభుత్వ పాఠశాలల ఉన్నాయి. వాటిలో సుమారు 45వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా ఉన్నత పాఠశాలల్లో వ్యాయామ విద్యకు తగిన ప్రాధాన్యం లేదు. రోజూ ఎనిమిది పీరియడ్లలో ఏదో ఒక పీరియడ్ వ్యాయామ విద్యకు కేటాయించాలి. కానీ, మైదానాల కొరత, క్రీడా పరికరాలు లేకపోవడంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుల కొరత ఉండడంతో ఆ దిశగా దృష్టి సారించడం లేదు. వారంలో ఒక రోజు తప్పనిసరిగా మాక్ డ్రిల్ నిర్వహించాల్సి ఉన్నా అమలు చేయడం లేదు.



క్రీడా మైదానం లేకపోవడంతో పాఠశాల ఆవరణలోనే కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

చౌటుప్పల్ మండలంలో ఇదీ పరిస్థితి

- చౌటుప్పల్ మున్సిపాలిటీతోపాటు చౌటుప్పల్ మండలంలో 16 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 2,040మంది విద్యార్థులు ఉన్నారు. దండుమల్కాపురం, కొయ్యలగూడెం, పీపల్‌పహాడ్, చిన్నకొండూరు, నేలపట్ల, జైకేసారం, పంతంగి, తంగడపల్లి, చౌటుప్పల్ ఉన్నత పాఠశాలల్లోనే పీఈటీలు ఉన్నారు. ఈ పాఠశాలల్లో క్రీడా స్థలాలున్నా క్రీడలకు సరైన ప్రాధాన్యంఇవ్వడం లేదు.
- తుప్రాన్‌పేట, డి.నాగారం, కుంట్లగూడెం, ఎస్.లింగోటం, అంకిరెడ్డిగూడెం, ఆరెగూడెం, లింగోజిగూడెం పాఠశాలలకు పీఈటీలు లేరు. పీఈటీ పోస్టులను ఇప్పటికీ ప్రభుత్వం మంజూరు చేయలేదు.

ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేదు



గత పదేళ్లగా ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేకపోవడంతో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వలేకపోతున్నాం. ఏటా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించాలన్నా నిధుల లేమితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం విడుదల చేసే కొద్దిపాటి నిధులు దేనికీ చాలడం లేదు. ఈసారి కేవలం రూ.10వేల చొప్పున కేటాయించింది. క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– బిక్కునాయక్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చౌటుప్పల్ మండల కన్వీనర్

మొక్కుబడిగా ఎస్‌జీఎఫ్ సేవలు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఏటా క్రీడల వార్షిక క్యాలెండర్ రూపొందించాలి. క్రీడా క్యాలెండర్‌ను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ, పథకం సరిగా అమలుకు నోచుకోకపోవడంతో జిల్లాలోని క్రీడా అసోసియేషన్లు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నాయి. నిధుల కొరత కారణంగా అవికూడా మొక్కుబడిగా సాగుతున్నాయి. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా ఏటా రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు నిధులు మంజూరవుతున్నా అవి దేనికీ చాలడం లేదని వ్యాయామ ఉపాధ్యాయులు వాపోతున్నారు.



ఆరెగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో క్రీడా పరికరాలు లేని గ్రౌండ్

మూసీని పరిశీలించిన కలెక్టర్, డీసీపీ



సంగెం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు



ఇంద్రపాలనగరం పెద్దచెరువును పరిశీలించి పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న డీసీపీ

వలిగొండ, రామన్నపేట : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 8న యాదాద్రి జిల్లా పర్యటనలో భాగంగా మూసీ పునరుజ్జీవన పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ హనుమంతరావు నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి సోమవారం వలిగొండ మండలం సంగెం సమీపంలో మూసీ నదిని, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. చెట్లు తొలగించి చదును చేసి దారి ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా డీసీపీ రాజేష్‌చంద్ర రామన్నపేట మండలంలోని నాగారం శివారునుంచి ఇంద్రపాలనగరం పెద్ద చెరువు వరకు ఆసిఫ్‌నహర్ కాల్వ ప్రాంతాలను పరిశీలించారు. సీఎం పర్యటన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచించారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

వలిగొండ పోలీస్ స్టేషన్‌ను డీసీపీ రాజేష్‌చంద్ర తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు, పురోగతిని తెలుసుకున్నారు. ఆయన వెంట చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్ రెడ్డి, రామన్నపేట సీపీ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు మల్లయ్య, యుగేందర్ ఉన్నారు.

క్లుప్తంగా

డెడికేటెడ్ కమిటీ మెంబర్ సెక్రటరీగా చౌటుప్పల్ వాసి


బడుగు సైదులు

చౌటుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న బీసీ కుల గణనకు సంబంధించి హైకోర్టు సూచన మేరకు ప్రత్యేకంగా డెడికేషన్ కమిటీ ఏర్పాటైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి భూసాని వెంకటేశ్వర రావును నియమించగా.. మెంబర్ సెక్రెటరీగా ఐఎఫ్ఎస్ అధికారి బడుగు సైదులు నియమితులయ్యారు. సైదులు స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్. ఉమ్మడి రాష్ట్రంలో ఐఎఫ్ఎస్ అధికారిగా వివిధ జిల్లాల్లో సేవలందించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత గ్రామీణాభివృద్ధి సంస్థ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్ర సంక్షేమ గురుకులాల కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. బీసీ కులగణన నివేదిక సమర్పించే కమిటీలో చౌటుప్పల్‌కు చెందిన వ్యక్తి నియమితులవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట రూరల్: ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన యాదగిరిగుట్ట పట్టణంలోని టెంపుల్ సిటీ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గజ్జి నర్సింహ (43) యాదాద్రి టెంపుల్ సిటీ పరిధిలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో టీఎస్25ఏ7137 గల ట్రాక్టర్‌ను తీసుకుని టెంపుల్ సిటీ పరిధిలో చెట్లకు నీళ్లు పోయడానికి వెళ్లాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో నడుపుతున్న నీళ్ల ట్యాంకర్‌ను డివైడర్‌కు గుద్దడంతో ట్రాక్టర్ ఒక పక్కకు బోల్తా పడింది. దీంతో డ్రైవర్ నర్సింహ కింద పడడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యమంలో మృతి చెందాడు. ట్రాక్టర్ బోల్తా పడిన సమయంలో మృతుడికి ఫిట్స్ కూడా వచ్చాయని స్థానికులు చెబుతున్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


రాపోలు రవితేజ (ఫైల్)

ఆలేరు రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన ఆలేరు మండలంలో ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో చోటు చేసుకుంది. సోమవారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణ కేంద్రానికి చెందిన రాపోలు ప్రకాష్ కొడుకు రవితేజ(23) బీఫార్మసీ సెకండియర్ చదువుతున్నాడు. ఆలేరు మండలం టంగుటూరు గ్రామ శివారులో ఓ రిసార్ట్‌లో తనతోపాటు పదో తరగతి చదివిన స్నేహితుల గెట్ టు గెదర్ చేసుకున్నారు. స్నేహితులకు భోజనం తేవడానికి తన పల్సర్ బైక్‌పై స్నేహితుడు కటకం సంజయ్‌తో కలిసి ఆలేరు టౌన్‌లోకి వెళ్లి తిరిగి రిసార్ట్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో టంగుటూరు శివారులోకి రాగానే శారాజీపేట నుంచి ఆలేరుకు వస్తున్న గుర్తు తెలియని వాహనాన్ని తపించబోయి బైక్ అదుపు తప్పి కింద పడిపోయారు. దీంతో రాపోలు రవితేజ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కటకం సంజయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి తండ్రి రాపోలు ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రజినీకర్ తెలిపారు.

అగ్రరాజ్యంలో ఎన్నికలపై మనోళ్ల ఉత్కంఠ



- కొందరు ట్రంప్‌కు, మరికొందరు కమలాహారిస్‌కు మద్దతు
- గెలుపు అవకాశాలు ఇద్దరికీ ఉన్నాయని విశ్లేషణ
- అమెరికాలో ఓటుహక్కు కలిగి ఉన్న.. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలువురి మనోగతం



ప్రపంచంలో అగ్రరాజ్యమైన అమెరికాకు మనదేశం నుంచి ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం వేలాది మంది వెళ్తుంటారు. ఇప్పటికే చాలామంది అక్కడి వెళ్లి స్థిరపడ్డారు. ఆ దేశంలో ఈనెల 5న జరగనున్న అధ్యక్ష ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా డోనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా కమలాహారిస్ బరిలో నిలిచారు. వీరిలో ఎవరు గెలుస్తారోనని యావత్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. అమెరికాలో ఓటుహక్కు వినియోగించుకోనున్న ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలువురి అభిప్రాయాలు వారి మాటల్లో..

కమలా హారిస్‌కే విజయావకాశాలు ఎక్కువ



కోదాడ: మాది కోదాడ. మేము ఉద్యోగ రీత్యా అమెరికాలోని నార్త్ కరోలినాలో ఉంటున్నాం. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్‌కే ఎక్కువ విజయావకాలున్నాయి. ఇతర దేశాల నుంచి ఇక్కడ స్థిరపడిన వారిలో 80 శాతం మంది కమలకే మద్దతుగా నిలుస్తున్నారు. భారతీయులు దాదాపు కమలాహారిస్ విజయం సాధించాలని కోరుకుంటున్నారు. ఇక్కడ వారి అంచనాల ప్రకారం 2శాతం మెజార్టీతో కమల గెలుపొంది అమెరికా అధ్యక్షురాలు అవుతుంది.

- కందిబండ ప్రియాంక, నార్త్ కరోలినా

ట్రంప్ గెలవకూడదని కోరుకుంటున్నారు



కోదాడ: మా స్వస్థలం కోదాడ పట్టణం. అమెరికాలోని నార్త్ కరోలినాలో స్థిరపడ్డాం. ప్రస్తుత పరిస్థితుల్లో డోనాల్డ్ ట్రంప్ గెలిస్తే ఇతర దేశాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారికి ఇబ్బందులు తప్పవనే ప్రచారం జరుగుతుంది. అమెరికన్‌లకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పడంతో ట్రంప్‌కు మద్దతిచ్చేవారు తగ్గిపోయారు. ట్రంప్ గెలవకూడదని ఎక్కువ శాతం ప్రజలు కోరుతున్నారు. నార్త్ కరోలినాలో భారతీయులు ఎక్కువగా ఉంటారు. ఇక్కడ కమలా హారిస్‌కే మద్దతు ఎక్కువగా ఉంది.

- శిరాబు కృష్ణకాంత్, నార్త్ కరోలినా

ట్రంప్ గెలిచే అవకాశం ఉంది



భువనగిరి: మాది భువనగిరి పట్టణం. అమెరికాలోని కాలిఫోర్నియాలో స్థిరపడ్డాం. ఈ నెల 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ డెమోక్రటిక్ పార్టీ నుంచి అధ్యక్షుడిగా బరిలో ఉన్న అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ గెలిచే అవకాశం ఉంది. గతంలో దేశానికి అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం కూడా ఉన్న ట్రంప్ మంచి ఆర్థిక సంస్కరణలు తీసుకురాగలరు. ట్రంప్ అధ్యక్షుడిగా ఉంటే అమెరికా–ఇండియా మధ్య సత్సంబంధాలు మెరుగుపడతాయి. రిపబ్లిక్ పార్టీకి చెందిన అభ్యర్థి కమలాహ్యారీస్ భారత సంతతికి చెందిన వారు అయినప్పటికీ ఇండియాకు చెందిన వారు ఆమెకు మద్దతు తెలపడం లేదు.

- జి.సంతోష్, కాలిఫోర్నియా

ప్రస్తుత పరిస్థితుల్లో ట్రంప్ గెలవాలి



భువనగిరి: మాది వలిగొండ మండలం టేకులసోమారం గ్రామం. అమెరికాలోని నార్త్ కరోలినాలో 23 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాం. అమెరికా అధ్యక్ష ఎన్నికలు రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీల అభ్యర్థుల మధ్య నువ్వా నేనా అన్నట్లుగా పోటీ నెలకొంది. ఆరు నుంచి 7 వరకు స్వింగ్ స్టేట్స్ వీరి గెలుపును నిర్ధారిస్తాయి. ఎవరు గెలిచిన స్వల్ప మెజార్టీతో గెలుస్తారు. ఇండియన్స్ ఎక్కువ శాతం ట్రంప్ వైపు మొగ్గు చూపుతున్నారు. నేడు మాత్రం ట్రంప్‌కే ఓటు వేయాలని నిర్ణయించుకున్నాను.

- పడమటి శ్యాంసుందర్‌రెడ్డి, నార్త్ కరోలినా

భారతదేశ అభివృద్ధికి సహకరించే వారికే ఓటేయాలి



అర్వపల్లి: మాది సూర్యాపేట జిల్లా మునగాల మండలం నర్సింహులగూడెం గ్రామం. అమెరికాలోని అట్లాంటా ఉంటున్నాం. ఇప్పటికే రెండు సార్లు అమెరికా ఎన్నికల్లో ఓటు వేశాను. భారతదేశ అభివృద్ధికి సహకరించే వారికి అమెరికా ఎన్నికల్లో భారతీయులు ఓటేయాలి. సాఫ్ట్‌వేర్ పరిశ్రమకు, భారత విదేశాంగ విధానం, ఎగుమతి, దిగుమతికి మద్దతు తెలిపే వాళ్లకే మా ఓటు. కులాలను చూసి ఓటు వేయవద్దు.

- జాలకంటి లక్ష్మారెడ్డి, అట్లాంటా

భారతీయులు ట్రంప్ వైపే..



అర్వపల్లి: మాది సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండల కేంద్రం. అమెరికాలోని హ్యూస్టన్‌లో స్థిరపడ్డాం. 30 ఏళ్ల పైనుంచి అక్కడే ఉంటున్నాం. ఇప్పటికే 20 సార్లు అక్కడ ఓటు హక్కు వినియోగించుకున్నాను. అమెరికాలో ఎక్కువ మంది భారతీయులు ట్రంప్‌వైపే ఉన్నారు. నాది రిపబ్లికన్ పార్టీ. నేను ఎన్నికల్లో ట్రంప్‌కే ఓటేస్తాను.

- ఆలూరి బంగార్‌రెడ్డి, హ్యూస్టన్

డెమోక్రటిక్ పార్టీ వైపే మొగ్గు



కోదాడ: మాది కోదాడ పట్టణం. అమెరికాలోని చికాగో నగరంలో స్థిరపడ్డాం. అధ్యక్ష్య ఎన్నికల్లో ఈ సారి ఇండియన్స్ డెమోక్రాట్స్ అభ్యర్థి కమలాహారిస్ వైపే మొగ్గు చూపుతున్నారు. స్వల్ప మెజార్టీతోనైనా కమల గెలుస్తుందనే చర్చ జరుగుతుంది. వలస చట్టాలపై ట్రంప్ కఠిన నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉందని ఇతర దేశాల నుంచి అమెరికా వచ్చిన వారు భయపడుతున్నారు. ట్రంప్ కూడా తన ప్రసంగాలలో ఇతర దేశాల నుంచి వచ్చి అమెరికన్‌ల అవకాశాలను దెబ్బతీస్తున్నారని ప్రచారం చేస్తున్నారు.

- బొగ్గారపు మణిదీప్, గుడుగుంట్ల నాగలక్ష్మి, చికాగో

డోనాల్డ్ ట్రంపే గెలుస్తారు



సూర్యాపేట: మాది సూర్యాపేట పట్టణం. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ సిన్సినాటి, ఒహాయో రాష్ట్రంలో ఉంటున్నాం. అమెరికా అధ్యక్ష ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్‌కే విజయావకాశాలు ఉన్నాయి. నేను కూడా అదే పార్టీకి ఓటేయాలనుకుంటున్నా. ఈ సారి ట్రంప్ గెలిస్తే ఉక్రెయిన్, ఇజ్రాయిల్ యుద్ధాలు ఆగిపోతాయని భావిస్తున్నాం. ట్రంప్ గెలిస్తే వ్యాపార వర్గాలకు పన్నుల్లో రాయితీ ఇస్తారని, దీంతో ద్రవ్యోల్బణం నియంత్రణ అవుతుంది.

- విజయశంకర్ కోణం, సిన్సినాటి, ఒహాయో

ట్రంప్ గెలిస్తేనే భారతీయులకు భద్రత



తిరుమలగిరి(నాగార్జునసాగర్): మాది నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం కొంపల్లి గ్రామం. నేను, నా భర్త బొలిగోర్ల శ్రీనివాస్, ఆలియాస్ కొంపల్లి శ్రీనివాస్ 2010లోనే అమెరికాలోని కొలంబస్‌కు వచ్చాం. అప్పటి నుంచి కొలంబస్‌లో ఉంటున్నాం. భారతీయుల భద్రత విషయంలో ట్రంప్ స్పష్టమైన హామీ ఇచ్చారు. ట్రంప్ గెలుస్తేనే భారతదేశానికి గానీ, అమెరికాలో ఉంటున్న భారతీయులకు గానీ లాభం చేకూరుతుంది. కమలాహారిస్‌భారత సంతతికి చెందినప్పటికీ ఎక్కువ మంది భారతీయులు ట్రంప్ వైపే మొగ్గు చూపుతున్నారు.

- దివ్య, కొలంబస్

ట్రంప్ గెలవాలనుకుంటున్నారు



నల్లగొండ: మాది నల్లగొండ. అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో స్థిరపడ్డాం. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కే విజయావకాశాలు కనిపిస్తున్నాయి. రాజకీయంగా కమలా హ్యారిస్‌కు అంతగా అనుభవం లేదని ప్రజల్లో ప్రచారం సాగుతోంది. గతంలో అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను చూస్తే ట్రంప్ వైపే అమెరికన్ ప్రజలు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ట్రంప్, కమలాహారిస్ మధ్య హోరాహోరీగా పోటీ ఉన్నా అమెరికా ప్రజలు ట్రంప్ గెలవాలనుకుంటున్నారు.

- కంచరకుంట్ల వెంకటరాంరెడ్డి, లాస్ ఏంజెల్స్

బలమైన నాయకత్వం అవసరం



ఆత్మకూర్ (ఎస్): మాది ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామం. అమెరికాలోని నార్త్ కేరోలినాలో కెమికల్ ఎనామిస్ట్‌గా స్థిరపడ్డాను. అమెరికా దేశం ముందు ఎన్నడూ చూడని సవాళ్లు ఎదుర్కొంటోంది. ధరలు పెరగడం, పెరుగుతున్న నేరాలు, సరిహద్దు భద్రత సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి బలమైన నాయకత్వం అవసరం. వైఫల్యంతో నిండిన బైడెన్ ఆర్థిక, వలస, విదేశీ విధానాల నుంచి పునరుద్ధరించడానికి ట్రంప్ గెలుపు చాలా అవసరం.

- దండ నీరజ, కెమికల్ ఎనామిస్ట్, నార్త్ కరోలినా

ట్రంప్ గెలిస్తేనే బాగుంటుంది



ఆత్మకూర్(ఎం) : మాది ఆత్మకూర్(ఎం) మండలం సిద్ధాపురం. మేము 27 సంవత్సరాల నుంచి అమెరికాలోని న్యూయార్క్ నగరంలో నివాసం ఉంటున్నాం. మంగళవారం అమెరికాలో అధ్యక్ష ఎన్నికల పోలింగ్ ఉంది. అమెరికా అధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ నుంచి ట్రంప్, డెమోక్రటికన్ పార్టీ నుంచి కమల హారిష్ పోటీ పడుతున్నారు. హోరాహోరీ పోటీలో ఎవరు గెలుస్తారో తెలియని పరిస్థితి ఉంది. ట్రంప్ ముక్కుసూటి మనిషి అయినా ఆయన గెలిస్తేనే భద్రత అనే ఉంటుందని నా అభిప్రాయం. కమలా హారిస్ అమెరికా ఉపాధ్యక్షులుగా ఉన్నా పాలన పరంగా పెద్దగా అనుభవం లేదు. ఆమె విధి విధానాలు ట్రంప్‌కు లాభం కలిగేలా ఉన్నాయి.

- ఏనుగు లక్ష్మణ్‌రెడ్డి, న్యూయార్క్

హోరాహోరీగా ఎన్నికల ప్రచారం



అర్వపల్లి: మాస్వగ్రామం సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం. అమెరికాలోని టెన్నెసి రాష్ట్రంలో ఉంటున్నాం. అక్కడ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. ఈసారి అక్కడి ఎన్నికల్లో మొదటిసారిగా ఓటు వేయబోతున్నాను. అమెరికాలో అధ్యక్ష ఎన్నికల ప్రచారం హోరాహోరీగా జరుగుతోంది. కమలాహారిస్, ట్రంప్ మధ్య పోటీ నువ్వా...నేనా అన్నట్లుగా ఉంది. భారతదేశ అభివృద్ధికి కృషిచేసే వారికే ఓటేయాలి. మొదటి సారి ఓటుహక్కు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది.

- జన్నపు శ్రీదేవి, టెన్నెసి

ట్రంప్‌తోనే ఉద్యోగావకాశాలు



నేరేడుచర్ల: మాది సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల. నేడు అమెరికాలో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోబోతున్నాను. ఈ ఎన్నికల్లో రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి ట్రంప్ గెలిచే అవకాశాలు ఉన్నాయి. ట్రంప్ గెలిస్తే భారతీయులకు ఉద్యోగ అవకాశాలు సురక్షితంగా ఉంటాయి. మేము ఉన్న ప్రాంతంలో మాతో పాటుగా చాలా మంది ట్రంప్‌కు ఓటు వేసే అవకాశాలున్నాయి.

- దొంతిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, బేబికాన్

నా మద్దతు కమలాహారిస్‌కే..



శాలిగౌరారం: మాది శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామం. అమెరికాలోని మిజోరి స్టేట్‌లో స్థిరపడ్డాం. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్‌ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ ఎన్నికల్లో తమ కుటుంబంలో ముగ్గురం ఓటు హక్కును వినియోగించుకోనున్నాం. నేను ఓటు వేయడం ఇది మూడవసారి. నా మద్దతు కమలాహారిస్‌కే.

- పాదూరి రామమోహన్‌రెడ్డి, మిజోరి స్టేట్

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

బీబీనగర్: మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన తర్రె మల్లేష్ కూతురు స్వప్న(34)కు బీబీనగర్ మండలం గొల్ల గూడెం గ్రామానికి చెందిన మేకల గణేష్‌తో 10 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా మానసిక వేధింపులకు గురవుతున్న స్వప్న సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఇంటి స్లాబ్‌కు గల ఉక్కుకు ఉరివేసుకొని మృతి చెందింది. కాగా తన చెల్లిని అదనపు కట్నం కోసం భర్త గణేష్, అత్త లక్ష్మమ్మ, బావ రమేష్‌లు వేధిస్తున్నారని, వారి వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుందని మృతురాలి అన్న తర్రె నాగరాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే స్వప్నను ఎలాంటి వేధింపులకు గురి చేయలేదని విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మృతురాలి భర్త గణేష్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరువురు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు దోహదం

- డీఐఈఓ రమణి
- ఉమ్మడి నల్లగొండ జిల్లా అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం


మాట్లాడుతున్న రమణి

భువనగిరి : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా ఇంటర్మీడియేట్ నోడల్ ఆఫీసర్ సి.రమణి అన్నారు. సోమవారం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 68వ ఎస్‌జీఎఫ్ అండర్–19 ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అథ్లెటిక్స్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు దోహదపడుతాయని చెప్పారు. అనంతరం జెండా ఊపి అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజనేయులు, ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, అర్గనైజింగ్ సెక్రటరీ ఇందిర, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ బాలకృష్ణ, పీడీ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అథ్లెటిక్స్ 1,500 మీటర్ల పరుగు పందెం బాలికల విభాగంలో కె.శివాని, జి.స్పందన, ఎస్.సంధ్య, ఎం సాగరిక, బాలుర విభాగంలో వి.చంద్రశేఖర్, జి.మధుకర్, ఎం.ప్రమోద్, డి.ప్రవీన్ గెలుపొందారు. 400 మీటర్ల పరుగు పోటీల్లో బాలికల విభాగంలో బి.దేవిశ్రీ, డి.సంజన, జి.ఆకాంక్ష, ఎం.మౌనిక, బాలుర విభాగంలో ఎస్.రాము, ఎన్.నవీన్, కె.శివ గెలుపొందారు. డిస్కస్ త్రోలోని బాలికల విభాగంలో కె.నందిని, ఎన్.ప్రణతీ, ఉదయ్‌శ్రీ, బాలుర విభాగంలో ఎం.రాహుల్, వి.వినోద్ కుమార్, ఎస్.అక్షయ్, జావలిన్ త్రోలో బాలికల విభాగంలో హరిక, రాజేశ్వరి, ప్రణతి గెలుపొందారు.


జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

మహిళా సంఘాల సొమ్ము స్వాహా!

- రూ.16.80 లక్షలు కాజేసిన వీబీకే
- ఆలస్యంగా తెలుసుకున్న సభ్యులు
- నిలదీయడంతో వారి ఖాతాల్లో కొంత జమ
- వీబీకే, అతనికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన


మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

రామన్నపేట : బ్యాంకులు మంజూరు చేసిన రుణం డబ్బులను వీబీకే స్వాహా చేశాడు. రెండేళ్లుగా సుమారు రూ.16.8లక్షలు తన ఖాతాలోకి మళ్లించుకుని సొంత అవసరాలకు వాడుకున్నాడు. ఆలస్యంగా తెలుసుకున్న మహిళా స్వయం సహాయక సభ్యులు అతన్ని నిలదీయడంతో స్వాహా చేసిన మొత్తంలో కొంత నగదు సభ్యుల ఖాతాల్లో జమ చేశాడు. ఈ సంఘటన రామన్నపేట మండల కేంద్రంలో సోమవారం వెలుగుచూసింది. వీబీకే, అతనికి సహకరించిన ఐకేపీ, బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని, వీబీకే నుంచి డబ్బులు రికవరీ చేయాలని డిమాండ్ చేస్తూ సంఘాల సభ్యులు ఆందోళనకు దిగారు.

ఏం జరిగిందంటే..

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో 56 సమభావన సంఘాలు ఉండగా, ఇటీవల రెండు సంఘ బంధాలను ఏర్పాటు చేశారు. ఆయా సంఘాలకు బ్యాంకులు పలు దఫాలు రుణాలు మంజూరు చేశాయి. మంజూరు చేసిన రుణంలో కొందరి సభ్యుల డబ్బులను వీబీకే లింగస్వామి తనతో పాటు తన కుటుంబసభ్యుల ఖాతాల్లోకి బదిలీ చేయించాడు. సభ్యులకు మాయమాటలు చెప్పి అదనపు వాయిదాలు కట్టించాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న మహిళా సంఘాల సభ్యులు ఇటీవల వీబీకే లింగస్వామిని నిలదీయగా రెండేళ్లలో సుమారు రూ.16.80 లక్షలు వాడుకున్నట్లు ఐకేపీ అధికారుల ఒప్పుకున్నాడు. అందులో రూ.10 లక్షలకు పైగా కొందరు సభ్యులు ఖాతాలో జమ చేశాడు.

ధర్నా, రాస్తారోకో

వీబీకే కాటెపల్లి లింగస్వామిని, అతని సహకరించిన ఐకేపీ, బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మహిళా సంఘాల సభ్యులు రామన్నపేటలోని చిట్యాల– భువనగిరి రహదారిపై రాస్తారోకో చేశారు. ఉన్నతాధికారులు వచ్చి సమాధానం చెప్పాలని భీష్మించారు. అక్కడికి వచ్చిన సీసీని నిలదీశారు. ఈ క్రమంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు సీసీని అక్కడి నుంచి తీసుకెళ్లారు.న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు వారికి నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమించారు. గంటకు పైగా రాస్తారోకో చేయడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి ఎస్‌బీఐకి వెళ్లి బ్యాంకు అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమ ప్రమేయం లేకుండా రుణాలు ఎలా మంజూరయ్యాయని, డబ్బులు ఎలా బదిలీ చేశారని నిలదీశారు. సంఘాల సభ్యులకు వివిధ రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి.

ఏపీఎం ఏమంటున్నారంటే..

నాలుగు రోజుల క్రితం విషయం తన దృష్టికి వచ్చింది. విచారణ చేపట్టగా సభ్యుల సొమ్ము రూ.16.80 లక్షలు వీబీకే తన, తన కుటుంబ సభ్యుల ఖాతాలో జమ చేసుకున్నట్లు తేలింది. తిరిగి రూ.12.80లక్షలు సభ్యుల ఖాతాల్లో జమ చేశాడు. ప్రతి పైసా రికవరీ చేసి తదుపరి చర్యలకోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

శాలిగౌరారం: మండలంలోని ఆకారం గ్రామంలో గల పురాతన సూర్య దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపగా సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకారం–వల్లాల అనుసంధాన డొంకదారి సమీపంలో వ్యవసాయ పంటపొలాల నడుమ పూర్తిగా శిథిలావస్థకు చేరి ఉన్న సూర్య దేవాలయంలో గుర్తుతెలియని దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. దేవాలయ ప్రాంగణంలో రెండు చోట్ల తవ్వకాలు చేపట్టిన దుండగులు గర్భ గుడిలో కూడా తవ్వకాలు జరిపారు. ఈ దేవాలయంలో సూర్యదేవుడి భారీ పంచలోహ విగ్రహంతో పాటు నంది, ఇతర విగ్రహాలు కూడా ఉండేవని స్థానికులు చెబుతున్నారు. పొరుగు రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి ఆలయ సమీపంలోని వ్యవసాయ భూములను కొనుగోలు చేసినప్పటి నుంచి గుప్తనిధుల కోసం ఇక్కడ తవ్వకాలు జరపడంతో పంచలోహ విగ్రహాలు మాయమయ్యాయని స్థానికులు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే మరోమారు దుండగులు తవ్వకాలు జరిపి ఉండవచ్చని గ్రామస్తులు అంటున్నారు.